సన్న ధాన్యానికి బోనస్ ఏదీ!

- రెండు నెలలుగా అందని డబ్బులు
- ఆందోళనలో అన్నదాతలు

తిప్పర్తి : సన్న ధాన్యానికి బోనస్ అందిస్తామని ప్రభుత్వం చెప్పడంతో గత వానాకాలం సీజన్‌లో తిప్పర్తి మండలంలోని రైతులు సన్నాలు పండించారు. వాటిని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం తిప్పర్తిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేసి ధాన్యం సేకరించింది. కానీ ధాన్యం అమ్మిన రైతులకు రెండు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం బోనస్ అందించలేదు. దీంతో బోనస్ డబ్బులు ఎప్పుడు తమ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయా అని రైతులు ఎదురు చూస్తున్నారు. మండల వ్యాప్తంగా గత వానాకాలం సీజన్‌లో 25వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. అందులో 12వేల ఎకరాల్లో రైతులు సన్నధాన్యం సాగు చేశారు. మిగిలిన 13వేల ఎకరాల్లో దొడ్డు ధాన్యం సాగు చేశారు. దొడ్డు రకం ధాన్యం సేకరణకు మండలంలో 8 ఐకేపీ, 8 పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.


తిప్పర్తిలో సన్నధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

మద్దతు ధర మాత్రమే రైతుల ఖాతాల్లో జమ

సన్న ధాన్యాన్ని చాలామంది రైతులు మిర్యాలగూడెం, ఇతర ప్రాంతాల్లో ప్రైవేట్ రైస్ మిల్లర్లకు అమ్ముకున్నారు. క్వింటాలుకు రూ.2500 చొప్పున విక్రయించారు. మరి కొంతమంది రైతులు మద్దతు ధర రూ.2320 తోపాటు రూ.500 బోనస్ వస్తుందని తిప్పర్తిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. తిప్పర్తి కొనుగోలు కేంద్రంలో సుమారు 18,150 క్వింటాళ్ల వరకు దాదాపు 400 మంది రైతులు సన్నధాన్యం విక్రయించారు. అయితే రైతులకు ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం మాత్రమే ధాన్యం డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ మాత్రం ఇప్పటికీ రెండు నెలలు కావొస్తున్నా జమ కాలేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో వారాల తరబడి ధాన్యం ఆరబెట్టుకుని కాపలా కాసి ధాన్యం అమ్ముకున్నామని, బోనస్ కోసం ఆశపడి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయిస్తే ఇంకా ప్రభుత్వం బోనస్ డబ్బులు జమ చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇకనైనా ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

బోనస్ జమ కాలేదు



ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో తిప్పర్తి కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించా. నాలుగు ఎకరాల ధాన్యం 120 క్వింటాళ్లు కొనుగోలు కేంద్రంలో అమ్మాను. ధాన్యం అమ్మిన వారంలోపు మద్దతు ధర రూ.2320 జమ అయ్యాయి. కానీ బోనస్ మాత్రం నేటివరకు జమ కాలేదు. బోనస్ డబ్బులు వెంటనే జమ చేయాలి.

– గుండు రవిగౌడ్, రైతు, తిప్పర్తి

బోనస్ ఇప్పించాలి



సన్నధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్మితే బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో తిప్పర్తిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మాను. కానీ ఇంతవరకు బోనస్ డబ్బులు నా ఖాతాలో జమ కాలేదు. మళ్లీ వ్యవసాయ సీజన్ ప్రారంభం అయ్యింది. ఇంకా డబ్బులు పడడం లేదు. అధికారులు వెంటనే బోనస్ ఇప్పించాలి.

– రొట్టెల లింగయ్య, రైతు, మర్రిగూడెం

త్వరలో డబ్బులు జమ అవుతాయి

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల వద్ద సన్నధాన్యం కొనుగోలు చేశారు. ప్రారంభంలో కొంతమంది రైతులకు ధాన్యం మద్దతు ధరతోపాటు బోనస్ డబ్బులు కూడా జమ అయ్యాయి. మిగిలిన వారికి కూడా త్వరలో జమ అవుతాయి.

– భిక్షమయ్య, తిప్పర్తి పీఏసీఎస్ సీఈఓ

జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్: జర్నలిస్టులు ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని, నల్లగొండలో రెండు ప్రెస్‌క్లబ్‌లు ఉండటం సరైంది కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలైన జర్నలిస్టులకు శుక్రవారం స్థానిక టీఎస్‌జీఓ భవన్‌లో బహుమతులు అందజేసి మాట్లాడారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పులిమామిడి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదె రమేష్, గౌరవ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, పయిమొద్దీన్, కోటగిరి దైవాదీనం, పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన పాలిటెక్నిక్ రెండవ సంవత్సరం చదువుతున్న గంటికంపు శివకుమార్ నిరుపేద కావడంతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం ల్యాప్‌టాప్ అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పలువురు రిటైర్డ్ ఉద్యోగ సంఘం నేతలు ఉన్నారు.

జీతాలు ఇవ్వాలని వినతి


కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న జేఏసీ సభ్యులు

నల్లగొండ: ఉపాధి హామీ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని ఉపాధి హామీ సిబ్బంది జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. మూడు నెలలుగా సిబ్బందికి వేతనాలు రావడం లేదని అన్నారు. ప్రతి నెల 1వ తేదీన జీతాలు అందించే విధంగా చూడాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షులు దాసరి రాజు, జిల్లా బాధ్యులు రమణ, యాదగిరి, రాంబాబు, ఈసం నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశం, గోపాల్ రెడ్డి ఉన్నారు.

మూడు ఎంపీటీసీ స్థానాలు కేటాయించాలి

చండూరు (గట్టుప్పల్): గట్టుప్పల్ మండల కేంద్రానికి మూడు ఎంపీటీసీ స్థానాలు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ మాధవ రెడ్డి కి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అంతంపేట గ్రామానికి నామాపురంను కలపకుండా ఎంపీటీసీ స్థానం ప్రకటించాలని వినతిలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, కర్నాటి సుధాకర్ ఉన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న నాగార్జున

నల్లగొండ టూటౌన్: విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. శుక్రవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా విద్య రంగానికి నిధులు కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్‌కు ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల ఉన్నత చదువులకు విఘాతం కలిగిస్తుందన్నారు. పెంచిన డైట్ చార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు నోముల శంకర్ యాదవ్, వంటల చేతన్, క్రాంతి కుమార్, గజ్జి నాని యాదవ్, మెదబోయిన రాజు, సింగారి శివ పాల్గొన్నారు.

8 గంటల పని విధానం రద్దుకు కుట్ర


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్

నల్లగొండ టౌన్: దేశంలో బీజేపీ ప్రభుత్వం 8 గంటల పని విధానం రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని, దీనిని అడ్డుకుందామని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని అంజయ్య కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన ఐఎన్‌టీయూసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో మంత్రి కోమటిరెడ్డి సహకారంతో కార్మిక భవన్‌ను నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంబటి సోమన్న, మోహినోద్దీన్, జమాల్, మహిమూద్, శంబిరెడ్డి, సహదేవ్, గౌస్, యాదయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

వాసవీ మాతకు పంచామృతాభిషేకం


బీట్ మార్కెట్‌లోని రామకోటి స్తూప దేవాలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని వాసవీ భవన్‌లో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, గణపతి, గౌరీ పూజ జరిపించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యామా మురళీకృష్ణ, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి శెట్టి శ్రీనివాస్, వనమా రమేష్, నల్లగొండ శ్రీనివాస్, మిర్యాల మహేష్, ఓంప్రసాద్, నల్లగొండ అశోక్, గజవెల్లి సత్తయ్య, పారేపల్లి వెంకన్న, కోటగిరి దైవాధీనం, వీరేల్లి సతీష్, నూనె కిషోర్, కోటగిరి రామకృష్ణ, శ్రీవాణి పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలో శ్రీ వాసవీ మాతా దేవాలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సహస్ర కుంకుమార్చన జరిపించారు. ఆలయ నిర్వాహకులు బ్రహ్మదేవర పద్మాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు బ్రహ్మదేవర నర్సింహరావు, రాంమోహన్‌రావు, వీర్లపాటి నర్సింహ, లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.


నకిరేకల్: వాసవీ మాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చిట్యాల: పట్టణంలోని శివాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ మాతా ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాతాకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. ఆర్యవైశ్య మహిళ సంఘం అధ్యక్షురాలు బెలిదే నర్మద ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా మాజీ అధ్యక్షురాలు పందిరి గీతా, జిల్లా కోశాధికారి వనమా అరుంధతి, జిల్లా ఉపాధ్యాక్షురాలు ఇమ్మడి చంద్రకళ, బుద్ద విమల, పోలా ధనమ్మ, అరుణ, పద్మ, నాగమ్మ, సంధ్య పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

నకిరేకల్: రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందురు సాగర్ ఆరోపించారు. శుక్రవారం నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన ఆ పార్టీ ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈనెల 20న న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి, నాయకులు జ్వాల వెంకటేశ్వర్లు, సిలేవేరు జానయ్య, బూరుగు సత్తయ్య, బీరెడ్డి సత్తిరెడ్డి, రావుల లింగయ్య, ఏమిరెడ్డి శ్రీనివాస్, చెరుకు సైదులు, గజ్జి రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

కట్టంగూర్: మండలంలోని అయిటిపాముల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆధ్వర్యంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్థికసాయంతో 150 మంది విద్యార్థులకు శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. హెచ్‌ఎం బద్రీనారాయణ మాట్లాడుతూ.. ప్రతి రోజు మధ్యాహ్నం మార్చి 14వ తేదీ వరకు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నల్లగొండ అధ్యక్షుడు హరినాథ్, జిల్లా గవర్నర్ కేవీ ప్రసాద్. కార్యదర్శి నిమ్మల పిచ్చయ్య, కోశాధికారి శంకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు సన్మానం


నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న కేటీఆర్


నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కేటీఆర్

నల్లగొండ టూటౌన్, నకిరేకల్: మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్లకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి దంపతులను సన్మానించారు. అదేవిధంగా నకిరేకల్ మున్సిపాలిటీ పాలకవర్గం గడువు ముగియనప్పటికీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్‌ను కేటీఆర్ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీష్ రావు, గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

కట్టంగూర్: చట్టాలపై బాలికలు, మహిళలకు అవగాహన ఉండాలని మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యావర్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్‌రావు, ఎంఈఓ అంబటి అంజయ్య, ఎంపీఓ చింతమల్ల చలపతి, అడ్వకేట్ శేరి చత్రపతి, మాజీ సర్పంచ్ సతీష్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో విద్యా సామర్థ్యాల పెంపు

చిట్యాల: పోటీ పరీక్షల్లో పాల్గొనటం ద్వారా విద్యార్థుల్లో విద్యా సామర్థ్యం పెంపొందుతుందని చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పద్మజ, ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్, చిట్యాల మండల అధ్యక్షుడు జూలకంటి భిక్షంరెడ్డి అన్నారు. శుక్రవారం చిట్యాలలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభా పోటీ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన శృతి(నేరడ), మహాలక్ష్మి(నేరడ), పి.అభినయశ్రీ(నేరడ)కు బహుమతులు వారు అందజేశారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు ఏశమల్ల నాగయ్య, కోణం శ్రీనివాస్, లుకేందర్‌రెడ్డి, ప్రసన్న పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

మునుగోడు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి యువత నిరంతరం పోరాటం చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ పిలుపునిచ్చారు. మునుగోడు మండలంలోని కల్వకుంట్లలో సమస్యల పరిష్కారానికి గ్రామంలోని డీవైఎఫ్‌ఐ, సీపీఎం నాయకులు చేస్తున్న దీక్షకు శుక్రవారం ఆయన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి, నర్సింహ, అంజయ్య, మారయ్య, మధు, సుందరయ్య, ముత్యాలు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మర్రిగూడ: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం మర్రిగూడ మండలంలోని దామెర భీమనపల్లి, మర్రిగూడ, ఖుదాబాక్షపల్లి, శివన్నగూడ గ్రామాల్లోని సబ్ స్టేషన్ పరిధిలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి అనుకూలమైన ప్రభుత్వ భూములను డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట సోలార్ ప్రాజెక్టు నల్లగొండ డీఎం పాండురంగారావు, డీటీ జూటూరు తారకరామన్, ఏపీఎం ప్రభాకర్, ఆర్‌ఐ పాండురంగారెడ్డి, ఆర్‌ఐ జహీరోద్దీన్ ఉన్నారు.


దామెరభీమనపల్లిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూములను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

సోలార్ ప్లాంట్ స్థలం పరిశీలన

చండూరు (గట్టుప్పల్): గట్టుప్పల్ మండల కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు స్థానికంగా గుట్ట ప్రాంతం స్థలాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్‌రెడ్డి, హడ్కో అధికారి పాండు రంగారావు శుక్రవారం పరిశీలించారు. వారి వెంట ఎంపీడీఓ మాధవరెడ్డి, తహసీల్దార్ రాములు, ఏపీఎం పుల్లయ్య ఉన్నారు.

రాజకీయంగా ఎదగనీయకుండా అక్రమ కేసులు


మాట్లాడుతున్న వాణిశ్రీకాంత్‌రాజు

శాలిగౌరారం: ఆరాధ్య ఫౌండేషన్ స్థాపించి ప్రజాదరణ పొందుతున్న తాడోజు శ్రీకాంతరాజును పాలకులు రాజకీయంగా ఎదగనీయకుండా అక్రమ కేసులు పెట్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజు అన్నారు. శుక్రవారం శాలిగౌరారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. శాలిగౌరారం మండలం ఉప్పలంచ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండారు మల్లయ్య హత్యతో తన భర్త శ్రీకాంత్‌రాజుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో శ్రీకాంతరాజు రాజకీయ ఎదుగుదలను నియంత్రించేందుకు కొంతమంది రాజకీయ నాయకులు, ముఖ్య ప్రజాప్రతినిధులు తమపై కుట్రపూరిత విధానాలను అవలంబిస్తున్నారన్నారు. సమావేశంలో ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు లక్ష్మి, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్ నాయక్, కల్వాల నరేశ్, మండల అధ్యక్షుడు గుండా దుర్గయ్య, కదారి మహేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వసతి గృహ నిర్మాణానికి భూమి పూజ

మునుగోడు: మండల కేంద్రంలోని శివరామ క్షేత్రంలో పనిచేసే పూజరుల వసతి గృహంతో పాటు సమావేశ మందిర నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. భవన నిర్మాణానికి దేవాలయ కమిటీ సభ్యుడు, మునుగోడు పట్టణానికి చెందిన పాలకూరి నర్సింహగౌడ్ రూ.10 లక్షలు విరాళం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాల్వాయి చెన్నారెడ్డి, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్, మిర్యాల వెంకటేశ్వర్లు, పాల్వాయి యాదగిరిరెడ్డి, సింగం కృష్ణయ్య, యడవల్లి సురేష్ కుమార్ పాల్గొన్నారు.






వజ్రోత్సవ సంబురం
నల్లగొండ జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కేక్ కట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌రెడ్డి, విద్యార్థుల నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

మంత్రి పరామర్శ


మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న మంత్రి

తిప్పర్తి: మండలంలోని దుప్పలపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ వంటెపాక సుశీల భర్త వంటెపాక పరశురాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరామర్శించి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, గుమ్మల మోహన్ రెడ్డి, కొండయ్య, అంజి తదితరులున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కేతేపల్లి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేతేపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ మట్టి సునీత సాల్మన్ కుమార్తె సమతను శుక్రవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. అదేవిధంగా కేతేపల్లికి చెందిన షాంసన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

మంత్రి కోమటిరెడ్డితోనే నల్లగొండ అభివృద్ధి

నల్లగొండ: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోనే నల్లగొండ అభివృద్ధి చెందుతోందని యువజన కాంగ్రెస్ నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్, పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు అన్నారు. శుక్రవారం నల్లగొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్: నల్లగొండలోని పరమేశ్వరి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న తంగల్లపల్లి అనంతమ్మ (90) శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఐ డొనేషన్ సెంటర్ టెక్నీషియన్ జాని మృతురాలి నేత్రాల సేకరణకు కుటుంబ సభ్యుల అనుమతి పొందారు. ఈమేరకు ఆపరేషన్ చేసి అనంతమ్మ నేత్రాలు సేకరించారు.

లక్ష్యాన్ని ఎంచుకోవాలి

రామగిరి(నల్లగొండ) : విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకోవాలని ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నామాపురం ఎంపీటీసీ పరిధిని కొనసాగించాలి

మర్రిగూడ: నామాపురం గ్రామ ఎంపీటీసీ పరిధిని అలాగే కొనసాగించాలని నామాపురం మాజీ ఎంపీటీసీ ఊరిపక్క సరిత కోరారు. ఈమేరకు శుక్రవారం గ్రామస్తులతో కలిసి గట్టుప్పల్ ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

ఎస్‌ఐకి సన్మానం

నల్లగొండ: నల్లగొండలో ఎస్సైగా పనిచేస్తున్న సీహెచ్ వెంకటయ్య పదవీ విరమణ పొందడంతో శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బీరేల్లిగూడెంలో విషజ్వరాలు

మునుగోడు : మండలంలోని బీరేల్లిగూడెం ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో మొత్తం 500 మంది జనాభా ఉండగా ఇప్పటి వరకు పదిహేను మంది జ్వరాల బారినపడ్డారు. వారంతా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరాల బారినపడ్డ వారిలో కొందరికి రక్తకణాలు తగ్గుతున్నాయని, మరి కొందరికి డెంగీ లక్షణాలు కూడా కనిపిస్తున్నాయని వైద్యులు చెప్తున్నట్లు తెలిసింది. ఈ విషయం స్థానిక ప్రభుత్వ వైద్యులకు తెలిసినా.. ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం: మండలంలోని ఉప్పలంచ గ్రామంలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు బండారు మల్లయ్య ఇటీవల హత్యకు గురయ్యాడు. బాధిత కుటుంబానికి డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ నేతృత్వంలో శుక్రవారం రూ.55 వేల ఆర్థికసాయం అందజేశారు.

రివిజన్ బుక్స్ పంపిణీ

తిప్పర్తి: మండలంలోని మామిడాల గ్రామ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రివిజన్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు చల్లా పాండురంగారావు, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కస్తాల వెంకన్న పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

నకిరేకల్: నకిరేకల్‌లో సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని న్యాయవాదులు కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. వారిలో పూజర్ల శంబయ్య, మంగ సైదులు, ప్రకాష్‌రావు తదితరులున్నారు.